

అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజామోదం..

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కార్యక్రమంలో సమస్యలపై గళమెత్తిన జనం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

- న్యాయం చేయాలని పాలకులు, అధికారులకు వినతులు
- వెంటనే పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి
- ప్రజలను తిప్పుకోవద్దు: మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి
- సానుకూల స్పందనతో హర్షం



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఏర్పాటు చేసిన వేదికపై ప్రజలు గళం విప్పారు. కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గత వైసీపీ పాలనలో సాగిన భూదందాపై బాధితులు గళమెత్తారు. జగనన్న కాలనీల్లో అక్రమాలపై బాధితులు ఆవేదన చెందారు. జగనన్న కాలనీలకు సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని వాపోయారు. జగనన్న కాలనీకి 14 ఎకరాల భూమిని తీసుకుని, పైసా కూడా పరిహారం ఇవ్వలేదని కొత్తచెరువుకు చెందిన రైతు నాగేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను విన్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, అధికారులు.. ప్రాధాన్యతా క్రమంలో అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలపై ప్రజలు తమ వాణి వినిపించారు.

\- ఆంధ్రజ్యోతి, ధర్మవరం/పుట్టపర్తి

కొత్తచెరువు గ్రామంలో 30 వేలకు పైగా జనాభా ఉంది. శ్మశాన వాటిక లేక పోవడంతో కాలువ గట్ల పైన, చెరువులో శవాలను పూడ్చుకుంటున్నాం. సమస్యను పరిష్కరించండి -సాలమ్మగారి శివప్రసాద్, వార్డు మెంబరు

రైల్వేఅండర్‌బ్రిడ్జితో దాదాపు 1500 ఎకరాల వ్యవసాయ పొలాలకు దారి లేకుండా పోయింది. దీంతో సమస్యలు తప్పడంలేదు. - బాధిత రైతులు





మాజీ మంత్రి పల్లె

ఇటీవల శ్మశాన వాటికకు తహసీల్దార్ నీలకంఠారెడ్డి, సర్వేయర్ సురేష్ కొండకింద ప్రాంతాన్ని సర్వే చేశారు. ఆ స్థలాన్ని ప్రజలకు ఎందుకు చూపించలేకపోతున్నారు. ఏంటి ఇబ్బంది అంటూ డీటీని ప్రశ్నించారు.

డీటీ:బాలాంజనేయులు: మరోసారి స్థలాన్ని సర్వే చేయించి శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తాం.

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు నుంచి పెనుకొండకు వెళ్లే రహదారిపై రైల్వేఅండర్ బ్రిడ్జి ఉండటం వల్ల రాకపోకలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవలే రైల్వే శాఖమంత్రి సోమణ్ణ దృష్టికి తీసుకెళ్లాం. అయన సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం.

శుభపరిణామం..

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన వేదిక ద్వారా ప్రజల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులకు ఆదేశించామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వేదికను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. అత్యంత ప్రాధాన్యత కల్గిన రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, పింఛన్లు, తాగునీటి సమస్య అతి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలకు భూమిని కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వకపోవడంపై వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెనుకొండ దారిలో రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం విషయాన్ని రైల్వేమంత్రి సోమన్న దృష్టికి తీసుకెళ్లామనీ, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.3.18 కోట్లు కేటాయించామన్నారు. అవి కూడా పూర్తయ్యాయనీ, వాటిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. మైలసముద్రం, నారేపల్లి, కేశాపురం గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏఈ వెంకటేశ్ నాయక్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు. ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రజలను తిప్పుకోవద్దు: మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

ఉద్యోగం భగవంతుడు ఇచ్చిన వరం అన్నారు. కరువు, వరదలు వచ్చినా జీతాలు వస్తాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. అధికారులు, పాలకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రజలను గౌరవించాలనీ, సమస్యలపై వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. ప్రభుత్వ భూములు, రోడ్లను ఎవరు కబ్జా చేసినా వెంటనే తొలగించాలనీ, ఇందులో కూటమి నాయకులు జోక్యం చేసుకోవద్దన్నారు. సమస్యలపై ఎమ్మెల్యే, అధికారులు స్పందించడం, పరిష్కార చర్యలకు ఉపక్రమించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



కార్యక్రమానికి హాజరైన జనం



సమస్యలు విన్నవిస్తున్న జనం

మెప్మాలో అక్రమాలకు చెక్..!

పక్కా సర్వేకు కూటమి ప్రభుత్వం శ్రీకారం

పొదుపు సంఘాల వివరాల నమోదుకు యాప్

ధర్మవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అక్రమాలు, బోగస్ పొదుపు సంఘాలకు చెక్ పడనుంది. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. వైసీపీ పాలనలో మహిళా స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)ల స్ఫూర్తి దెబ్బతింది. సంఘాల పేరుతో అధికారులు, కొంతమంది నాయకులు విడుదలైన నగదు దిగమింగారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ప్రభుత్వ పథకాలకు అర్హులెవరు? వారికి ఎంత లబ్ధి చేకూరింది? తదితర అంశాలను సర్వే ద్వారా సేకరించి, కంప్యూటరీకరణ ద్వారా గుర్తిస్తారు. మహిళల ఆర్థిక సాధికారతే ఎస్‌హెచ్‌సీల ఉద్దేశం. ఈ ప్రకారం కార్యాచరణ మొదలైంది. జిల్లాలో మెప్మా పరిధిలో 8 వేల పొదుపు సంఘాలున్నాయి. వాటిలో సభ్యులు నెలవారీ సమావేశాలు నిర్వహిస్తుంటారు. సమావేశాలకు రాకుండా వచ్చినట్లు నమోదు చేయడం, మృతులనూ సభ్యులుగా కొనసాగించడం, బినామీ పేర్లతో సంఘాలను ఏర్పాటుచేసి రుణాలు కాజేయడం, పొదుపు నిధులను ఇష్టానుసారం అప్పుగా ఇవ్వడం వంటి అనేక రకాల అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇకపై వీటన్నింటికీ చెక్ పడనుంది. నెలవారీ సమావేశాలకు బయోమెట్రిక్ ఆధారిత ముఖహాజరు తప్పనిసరి చేశారు.



ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్

ప్రత్యేక యాప్ రూపకల్పన

పొదుపు సంఘాల్లో ప్రతి సభ్యురాలి వివరాలు చిటికెలో తెలుసుకునేలా మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నారు. సభ్యుల ఆధార్‌తో అనుసంధానమైన పేర్లు, సంఘాల్లో వారు చేరిన తేదీ, విద్యార్హత, కులం, పిల్లలు, వైకల్యం, గ్యాస్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల్లో ఎంతమంది లబ్ధి పొందారు? ఎవరికి రాలేదు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు, జీవనోపాధి, వృత్తిపరమైన నైపుణ్యం, నెలసరి ఆదాయం, వ్యక్తిగత పొదుపు వివరాలు నమోదు చేస్తున్నారు. సంఘం సభ్యురాలి కుటుంబంలోని వ్యక్తుల విద్యార్హతలు, పారిశ్రామికంగా అభివృద్ధికి ఉన్న అవకాశాలు, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల కోసం రుణాల ఆవశ్యకత, కుటుంబ సభ్యుల్లో నిపుణులు ఉంటే ఆ వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు. పొదుపు రుణాలు, వడ్డీ చెల్లింపులు, మాఫీలు, నెలవారీ సమావేశాలు అప్‌లోడ్ చేస్తున్నారు. రుణాల చెల్లింపుల్లో సక్రమంగా ఉన్న గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందుకోసం మెప్మా కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేనుంది. సభ్యుల వ్యక్తిగత ఖాతాలకే నగదు జమచేయడం ద్వారా మామూళ్ల బెడద కూడా ఉండదు. ఈ యాప్‌లో ఒక్కో సభ్యురాలికి ఒక్కో గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు.

ఆర్థిక స్వావలంబనకు అవకాశం

సర్వే ద్వారా యాప్‌లో పొదుపు సంఘాలు, సభ్యుల వివరాలు నమోదవుతాయి. క్రమబద్ధమైన సమావేశాలు, పొదుపు, అంతర్గత అప్పులు, చెల్లింపులు, పుస్తక నిర్వహణతో సంఘాల బలోపేతంతోపాటు ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉంటుంది. అక్రమాలకు అవకాశం ఉండదు.

\-విశ్వజ్యోతి, మెప్మా పీడీ

ధర్మవరం పట్టుచీరకు ప్రపంచ ఖ్యాతి

\- కేంద్ర చేనేత, జౌళిశాఖ మంత్రి



ధర్మవరం పట్టుచీర గురించి కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు వివరిస్తున్న డిజైనర్ నాగరాజు

ధర్మవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టుచీర ప్రపంచ ఖ్యాతిని గడించిందని కేంద్ర చేనేత, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కొనియాడారు. మంగళవారం ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్ 5 జన్‌పథ్‌లో హ్యాండ్‌లూమ్ ఎన్‌స్లేవ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ధర్మవరానికి చెందిన డిజైనర్ నాగరాజుకు ఆహ్వానం అందింది. ఆ మేరకు ఆయన హాజరయ్యారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ధర్మవరం పట్టుచీరల తయారీకి వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. తాను పట్టుచీరపై డిజైన్ చేసిన అఖండ భారతదేశ చిత్రాన్ని కేంద్ర మంత్రికి బహూకరించినట్లు ఆయన తెలిపారు.

మాతాశిశు మరణాలకు తావివ్వద్దు

కలెక్టర్ టీఎస్ చేతన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతాశిశు మరణాలను వంద శాతం అరికట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్. వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో మాతాశిశు మరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రసవిస్తూ ఏ తల్లీ మరణించకూడదన్నారు. ఏ బిడ్డా జన్మిస్తూ మృతిచెందకూడదన్నారు. జిల్లా వైద్యాధికారి ఫిరోజ్‌బేగం మాట్లాడుతూ.. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు ప్రతి ఆశా కార్యకర్త, సూపర్‌వైజర్ నిత్యం పర్యవేక్షించాలన్నారు. సుఖ ప్రసవం అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ తిపేంద్రనాయక్, జిల్లా ఉప వైద్యాధికారి మంజువాణి, వైద్యాధికారులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కుల జాబితాలు వచ్చేశాయ్..

కొత్తచెరువు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గతేడాది ఏప్రిల్‌లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయ్యర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి మార్కుల జాబితాలు జిల్లాకి చేరినట్లు డీఈఓ కిష్టప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లతో వచ్చి మార్కుల జాబితాలను తీసుకెళ్లాలని సూచించారు.

దావోస్‌లో ప్రత్యేకాకర్షణగా ఏపీ

ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకాకర్షణగా నిలిచిందని ఎంపీ బీకే పార్థసారథి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు.



రాష్ట్రంలో ఉన్న అపార వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ పాలసీల గురించి పారిశ్రామిక వేత్తలకు వివరించి, పెట్టుబడులు పెట్టేలా వారిని ఆహ్వానించారన్నారు. ప్రతి పారిశ్రామిక వేత్త సానుకూలంగా స్పందించారన్నారు. అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టబోతున్నాయన్నారు.

గొలుసులు గుంజేస్తున్నారు..!

రెచ్చిపోతున్న దొంగలు

పగలే చైన్ స్నాచింగ్‌లు



కదిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నిర్జన ప్రదేశంలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళల నుంచి గొలుసులను లాక్కెళ్లేవారు. ప్రస్తుతం దుండగులు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో, అది కూడా దుకాణంలో వ్యాపారం చేసుకునే మహిళల నుంచి గొలుసులు లాక్కెళ్తున్నారు. ఏదో వస్తువు కొంటున్నట్లు వారిని ఏమార్చి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ హఠాత్పరిణామం నుంచి మహిళలు కోలుకునేలోపే దుండగులు ద్విచక్ర వాహనాల్లో ఉడాయిస్తున్నారు. జిల్లాలో రెండ్రోజుల వ్యవధిలో మూడు ఇదే తరహాలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. దీంతో మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా.. కట్టడి చేయడంలో పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖాకీ నిఘా కొరవడిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నల్లమాడ మండలంలోని చెర్లోపల్లిలో గొలుసును

జంకుతున్న మహిళలు

అపహరించిన రోజే పోలీసులు అప్రమత్తమై నిఘా వేసి ఉండుంటే, ఓడీసీలో మరో చోరీ జరిగి ఉండేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పట్టపగలు, అది కూడా దుకాణంలో ఉంటున్న మహిళల నుంచే గొలుసులను లాక్కెళ్లారు. ఈ ఘటనలు ఒకే తరహాలో జరగడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఒంటరిగా షాపుల్లో కూర్చోవడానికి మహిళలు జంకుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు కూడా అవగాహన కల్పించాల్సి ఉంది. షాపుల్లో బంగారు నగలు వేసుకున్నపుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

దుకాణంలో ఉంటున్న మహిళలే టార్గెట్

వరుసగా మూడు ఘటనలు

కొరవడిన ఖాకీ నిఘా



ఓబుళదేవరచెరువులో చైన్‌స్నాచింగ్‌పై వివరిస్తున్న బాధితురాలు భార్గవి (ఫైల్)

నిఘా పెంచాం

నల్లమాడ సర్కిల్ పరిధిలో వరుస ఘటనల నేపథ్యంలో నిఘా పెంచాం. పాత నేరస్థులను విచారిస్తున్నాం. ముఠాను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. త్వరలోనే పట్టుకుంటాం.

\- నరేంద్రరెడ్డి, సీఐ, నల్లమాడ

ఈనెల 26న.. ధర్మవరంలోని వైఎస్సార్ కాలనీలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న శశికళ వద్దకు ఉదయం ఇద్దరు దుండగులు బైక్‌లో వచ్చారు. షాపు దగ్గరగా వాహనాన్ని తీసుకెళ్లి శశికళ మెడలోని బంగారు గొలుసును వెనుక కూర్చున్న దుండగుడు లాగేసుకున్నాడు. బైక్‌పై వేగంగా ఉడాయించారు.

ఈనెల 26న.. నల్లమాడ మండలంలోని చెర్లోపల్లిలో రత్నమ్మ దుకాణం నిర్వహిస్తోంది. మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై షాపు వద్దకు వచ్చి రత్నమ్మ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు.

ఈనెల 27న.. ఓబుళదేవరచెరువులోని కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో భార్గవి నిర్వహిస్తున్న దుకాణం వద్దకు ఇద్దరు దుండగులు బైక్‌లో వచ్చారు. ఓ దుండగుడు బైక్ దిగి, అర లీటరు వాటర్ బాటిల్ తీసుకుని, రూ.20 ఇచ్చాడు. భార్గవి రూ.10 చిల్లర ఇస్తున్న క్రమంలో ఆమె మెడలోని గొలుసును దుండగుడు లాగాడు. ఆమె ప్రతిఘటించడంతో గొలుసు తెగిపోయింది. కొంతభాగాన్ని దుండగుడు లాక్కెళ్లాడు.



అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



కొత్తచెరువులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

అక్షరంపై విశ్వాసం

ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ వేదికపై ప్రజాగళం

■ సమస్యలపై వెల్లువలా వినతులు.. ఫిర్యాదులు... ■ ఓపికగా ఆలకించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ■ ప్రాధాన్యక్రమంలో పరిష్కారానికి అక్కడికక్కడే హామీ

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అనంతపురం ఆదర్శ కాలనీ, కొత్తచెరువు బీసీ కాలనీలో సభలకు వెయ్యిమందికి పైగా ప్రజలు హాజరయ్యారు. కొందరు నేరుగా గళం విప్పి తమ సమస్యలను ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరికొందరు వినతిపత్రాలను సమర్పించారు. అనంతపురంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కొత్తచెరువులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి ప్రజల సమస్యలను నోట్ చేసుకుని, అంశాలవారీగా స్పందించారు. కొన్నింటికి తక్షణ పరిష్కారం చూపించారు. మిగిలినవాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, తమకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆంధ్రజ్యోతి అక్షరంపై విశ్వాసం ఉంచి.. అరుదైన ఈ కార్యక్రమానికి జనం భారీగా తరలిరావడం విశేషం. సామాజిక బాధ్యతగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠకులు హర్షం వ్యక్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం, అనంతపురం క్రైం



చిత్రావతి, వంగపేరు బ్రిడ్జిలపై ఎత్తు పెంచాలి.

- పూల శివప్రసాద్, జనసేన మండల కన్వీనర్, కొత్తచెరువు

పీఆర్ జేఈ: వర్షాలు వచ్చినప్పుడు వంగపేరు, చిత్రావతి నది పొంగి పొర్లడంతో ఆమిదాలకుంట, మరుకుంటపల్లి, కొత్తచెరువు సమీపంలో బ్రిడ్జిపై నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఆర్అండ్బీ అధికారులు, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.



బీసీకాలనీలో మా ఇళ్లమీద 33కేవీ లైన్ వెళ్తోంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించండి.

ఒలిపి శ్రీనివాసులు, టీడీపీ కొత్తచెరువు పట్టణ కన్వీనర్



ట్రాన్స్కో ఏఈ, వెంకటేశ్ నాయక్: బీసీకాలనీలోని ఇళ్లపై 33 కేవీ విద్యుత్లైన్ వెళ్లడం వాస్తవమే. ఇటీవల ప్రమాదాలు జరగకుండా వైర్ల ఎత్తు పెంచాం. లైన్ మార్చడం నా పరిధిలో లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం.

వ్యవసాయ బావులకు సరఫరా అయ్యే విద్యుత్ కేబుల్ కాలి పోయింది. పంటలు ఎండుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని పలు మార్లు ట్రాన్స్కో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు.

- బీడుపల్లి సుబ్బరాయుడు, కొత్తచెరువు



శివరాం, ట్రాన్స్కో ఈఈ: విద్యుత్ కేబుల్ కాలి పోయిన విషయం వాస్తవమే. అయితే తలమర్ల సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా అందిస్తున్నాం. లో ఓల్టేజ్ లేకుండా సమస్యను పరిష్కరిస్తాం. కేబుల్ కోసం ప్రతిపాదనలు పంపాం. కేబుల్రాగానే ఏర్పాటు చేస్తాం.



ప్రశ్న: జగనన్న కాలనీ కోసం 14 ఎకరాల భూములు తీసుకున్నారు. పరిహారం కోసం మాజీ ఎమ్మెల్యే శ్రీధర్రెడ్డికి విన్నవించాం. అధికారుల చుట్టు తిరిగినా పట్టించుకోలేదు. ఎక్కువగా మాట్లాడితే కేసులు బనాయిస్తామని బెదిరించారు. భూములు కోల్పోయాం. పైసా పరిహారం ఇవ్వలేదు.

- నాగేంద్రప్రసాద్, రైతు, కొత్తచెరువు



జగనన్న లే ఔట్కు 1.30 ఎకరాల భూమి ఇచ్చాం. పరిహారం రూ.50లక్షలు, ఇళ్లపట్టాలు ఇస్తామన్నారు. ఇంత వరకు ఇవ్వలేదు.

- పీవీ నవీన్కుమార్, సాగునీటిసంఘం అధ్యక్షుడు




డీటీ బాలాంజనేయులు: ఎక్కడైనా పరిహారం చెల్లించిన తరువాతనే భూమిని స్వాధీనం చేసుకుంటారు. కానీ గతంలో ఇది ఎలా జరిగిందో పరిశీలించి న్యాయం చేస్తాం. అదేవిధంగా జగనన్న కాలనీకి దారి కోసం తీసుకున్న భూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.



ప్రమాదంలో చెయ్యి పోయింది. మా ఆయన కూడా మంచాన పడ్డాడు. కుటుంబం గడవడం కష్టమైంది. పింఛన్ కోసం పలు మార్లు దరఖాస్తు చేసుకున్న మంజూరు కాలేదు. పింఛన్ మంజూరు చేయించండి.

-నాగరత్న, కొత్తచెరువు

ఈఓ: త్వరలో పింఛన్ దరఖాస్తుకు సైట్ ఓపెన్ అ వుతుంది దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరయ్యేలా చూస్తాం.





సమస్యలు తెలిపేందుకు వచ్చిన అనంతపురంవాసులు

పింఛన్ ఇచ్చి ఆదుకోండి సార్..



ఎమ్మెల్యే సార్... నాకు ఎవరూ లేరు. గతంలో పింఛన్ వచ్చేది. కరెంటు బిల్లు ఎక్కువ వస్తోందని 2021లో పింఛన్ తీసేశారు. అడిగితే ఎవరూ ఏమీ చెప్పడం లేదు. నేను టీడీపీ సానుభూతిపరురాలనే పింఛన్ తీసేశారు. నాకు పింఛనే ఆదరవు. ఆరోగ్యం బాగోలేదు. మాత్రలు కొనుక్కుందామన్నా డబ్బులు లేవు. నాకు మళ్లీ పింఛన్ ఇప్పించి ఆదుకోండి సార్.

- అచ్చమ్మ, విద్యుత్నగర్, అనంతపురం

ఎమ్మెల్యే: టీడీపీ సానుభూతిపరురాలనే కారణంగా పింఛన్ తొలగించారని అచ్చమ్మ చెబుతున్నారు. ఆమెకు ఆదరణ లేదు. న్యాయబద్ధంగా రావాల్సిన ఫించన్ రానివ్వడం లేదు. కొత్త పింఛన్లు శాంక్షన్ కాగానే మొదటి ఫించన్ ఆమెదే అవుతుందన్నారు.

ఖాళీ స్థలాలను క్లీన్ చేయించండి...



ఆదర్శ కాలనీలో చాలా ప్రైవేట్ స్థలాలున్నాయి. వాటిలో కంపచెట్లు, చెత్తా చెదారం నిండుకోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నాం. ఇళ్లలోకి విషపురుగులు వస్తున్నాయి. చెత్తను, ముళ్ల పొదలను తొలగించండి.

- చిన్నకొండయ్య, అనంతపురం

ఎమ్మెల్యే: ఆదర్శ నగర్తోపాటు నగరంలోని ఖాళీ స్థలాలన్నింటినీ శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే ఎంహెచ్ఓకు సూచనలు ఇచ్చాం. ప్రతి కాలనీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి, ఖాళీ స్థలాల యజమానులను పిలిపించి శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే శారదా నగర్లో శుభ్రం చేయించాము. యజమాని రాకపోతే మేమే శుభ్రం చేయించి, వారికి జరిమానా విధిస్తాం.

సింగిల్ ఫేజ్తో ఇబ్బందులు



ఆదర్శ కాలనీలో సింగిల్ ఫేజ్ లైన్తో కరెంటు సమస్య ఏర్పడుతోంది. త్రిబుల్ ఫేజ్ లైన్ ఇవ్వాలని పలుమార్లు కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డులో విచ్చలవిడిగా బంకులు ఉన్నాయి. రోడ్డుకు ఇబ్బంది మారింది. లక్ష్మీనరసయ్య కాలనీలో లో ఓల్టేజీ సమస్య ఉంది. రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సమస్యలను పరిష్కరించండి సార్...

- దాసరి శ్రీనివాసులు, ఆదర్శనగర్

ఎమ్మెల్యే: ఎస్ఈతో మాట్లాడి త్రీఫేజ్ విద్యుత్ ఇచ్చేలా చూస్తాం. మిగిలిన సమస్యలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తాం.

ఆస్పత్రిని నిర్మించండి



స్కేటింగ్ మైదానంతో ఎవరికీ ఉపయోగం లేదు. ఎవరో కొంత మంది పిల్లలు వస్తున్నారు. ఆ స్థలంలో ఆస్పత్రిగాని, పాఠశాలగాని ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. సమస్యలను పరిష్కరించండి

- ఆంజనేయులు, రిటైర్డ్ హెచ్ఎం, అనంతపురం

ఎమ్మెల్యే: స్కేటింగ్ స్థలం వందమంది విద్యార్థులకు ఉపయోగపడుతోంది. పాఠశాల, ఆస్పత్రి కావాలంటే వేరే స్థలం చూసి ఏర్పాటు చేయిస్తాం. విద్య, వైద్యం ఎంత అవసరమో.. క్రీడలూ అంతే అవసరం.

ఇల్లు లేదు.. పింఛన్ లేదు..



సార్..! నాకు పింఛన్ లేదు. ఇల్లు లేదు. ఎలాంటి ఆదరవు లేదు. ఎన్నిసార్లు ఎంత మందిని అడిగినా పట్టించుకోవడం లేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే వారు ఏవేవో చెబుతున్నారు. అర్థం కావడం లేదు. నాకు ఇల్లు కట్టించి, పింఛన్ ఇప్పించండి.

- ఫాతిమా, ఆదర్శనగర్

ఎమ్మెల్యే: మున్సిపల్ కమిషనర్తో మాట్లాడి మీ సమస్యలను పరిష్కరిస్తాం.

రైతు బజారు ఏర్పాటు చేయండి



ఆదర్శ నగర్ నుంచి పాతూరుకు వెళ్లి సరుకులు, కూరగాయలు తెచ్చుకోవాలంటే రవాణా ఖర్చులు అధికమవుతున్నాయి. చాలా మంది వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో చాలా చోట్ల ఖాళీ స్థలాలున్నాయి. ఏదో ఒకచోట రైతు బజారు ఏర్పాటు చేస్తే మాలాంటి వ్యాపారులకు ఇబ్బందులు తప్పుతాయి.

- నరసింహారెడ్డి, వ్యాపారి

ఎమ్మెల్యే: రైతు బజారు ఏర్పాటుకు మనకు అవకాశం ఉంది. 50 సెంట్ల ఖాళీ స్థలం ఉంటే చూడమని కమిషనర్ను కోరుతున్నాం. స్థలం కేటాయించగానే రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాము.


ఇళ్లు, పింఛన్ ఇప్పించండి..



నాకు ఇళ్లు లేదు. కొన్నేళ్లుగా అధికారులు, రాజకీయ నాయకులను అడుగుతున్నాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. పింఛన్ కూడా రావడం లేదు. డబ్బు అవసరమొస్తే ఇబ్బందులు పడుతున్నాను. నాకు ఒక గూడు ఏర్పాటు చేసి, పింఛన్ ఇప్పిస్తే బతుక్కుంటాను.

- నాగమ్మ, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: మీకు న్యాయం జరుగుతుంది. నగరవాసులకు 880 ఇళ్లు మంజూరయ్యాయి. మీకు స్థలం ఉంటే ఇంటిని మంజూరు చేయిస్తాం. స్థలం లేకుంటే.. స్థలం చూపించి ఇల్లు కట్టించి ఇస్తాం. పింఛన్ మంజూరు చేయిస్తాం.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

రొమ్ము క్యాన్సర్తో...



సార్..! నేను రొమ్ము క్యాన్సర్తో ఇబ్బంది పడుతున్నాను. నాకు ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులు చేసుకుంటూ వారిని పోషిస్తున్నాను. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. నాకు పింఛన్ ఇప్పించి ఆదుకోండి సార్.

- రమ, కూలీ, అనంతపురం

ఎమ్మెల్యే: ప్రభుత్వం తరఫున ఏమాత్రం అవకాశమున్నా వైద్యానికి సాయం చేస్తాం. పింఛన్ అందించి ఆదుకుంటాం.

సెల్ టవర్ తొలగించండి



సార్..! 32వ డివిజన్లో సెల్ టవర్లు అధికమయ్యాయి. ఎక్కడా చూసినా సెల్ టవర్లు ఉన్నాయి. రేడియేషన్ ఎక్కువవుతోంది. కాలనీలో ఎంతో మంది క్యాన్సర్ బారిన పడ్డారు. నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించి ఆదుకోండి.

- రవిశంకర్, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: సెల్ టవర్ల సమస్య ఆదర్శనగర్లోనే కాదు... దేశవ్యాప్తంగా ఉంది. టెక్నికల టీమ్తో మాట్లాడి.. ఒకే టవర్ మీద అన్నింటినీ ఏర్పాటు చేయిస్తాం.

రోడ్లు కబ్జా అవుతున్నాయి..



ఆదర్శ నగర్ 341 సర్వే నంబర్లో రోడ్డు లైన్ లేదు. కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దారిలో వెళుతున్నప్పుడు ముళ్ల తగిలి గాయపడుతున్నాం. ఇబ్బందికరంగా ఉంది. 31 సర్వే నంబర్లో రోడ్లను కొందరు కబ్జా చేస్తున్నారు. వాటిని వెంటనే కాపాడి రోడ్లు నిర్మించాలి. మరికొన్ని చోట్ల రోడ్లలో గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చాలి.

- చెన్నకేశవ, అనంతపురం

ఎమ్మెల్యే: వైసీపీ ప్రభుత్వంలో రోడ్లను ఆక్రమించారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాను. వీలైనంత త్వరగా రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం.

రోడ్డు నిర్మించాలి



హమాలీ కాలనీ వాటర్ ట్యాంకు వద్ద 40 అడుగుల రోడ్డుకు చాలాసార్లు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. కానీ పూర్తి చేయడంలేదు. ప్రతిసారీ ఇలాగే జరుగుతోంది. కాలనీలో కంపచెట్లు పెరిగి అధ్వాన్నంగా ఉంది. పలు రోడ్లపై గుంతలు పడ్డాయి. వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

- మహబూబ్ పీరా, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్, అనంతపురం

ఎమ్మెల్యే: వైసీపీ ప్రభుత్వంలో రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్ తీసుకొచ్చారు. రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి వదిలి పెట్టారు. ఎక్కడా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. ఆ పనుల టెండర్లు క్యాన్సిల్ అయ్యాయి. కొత్త టెండర్లు పిలిచి రోడ్లు వేయిస్తాం. హమాలీకాలనీలో రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తాం.

పార్కు ఏర్పాటు చేయండి



సార్.. ఆదర్శ నగర్లో 40 సెంట్లు కార్పొరేషన్ స్థలం ఉంది. అది కబ్జాకు గురికాకుండా కాలనీవాసుల ఆహ్లాదం కోసం ఒక పార్కును ఏర్పాటు చేయండి. ఆ స్థలంలో కాలనీవాసులకు ఉపయోగపడే ఇతర పనులను కూడా చేపట్టండి.

- రాజారెడ్డి, అనంతపురం

ఎమ్మెల్యే: వాటర్ ట్యాంకు సమీపంలో పార్కు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అక్కడ ప్రైవేట్ స్థలం ఉంది. కార్పొరేషన్ స్థలం ఉంటే పార్కు ఏర్పాటు చేయిస్తాం.

ఉపాధి చూపండి



ఆదర్శ కాలనీలో నిరుద్యోగులు చాలా మంది ఉన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సీమెన్స్తో ఒప్పందం చేసుకుని రూ.5 కోట్ల కంప్యూటర్ పరికరాలు కొనుగోలు చేశారు. అవి ఐదారేళ్లుగా జేఎన్టీయూలో నిరుపయోగంగా ఉన్నాయి. కాలనీలో సెంటర్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపండి.

- వన్నూరప్ప, అనంతపురం

ఎమ్మెల్యే: జేఎన్టీయూ వీసీతో మాట్లాడి ఆదర్శ నగర్కు కంప్యూటర్లు తెప్పిస్తాం. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేయిస్తాం. యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాలను చూపిస్తాం.

మా అన్నకు పింఛన్ ఇప్పించండి..



సార్..! మా అన్న పేరు గణేష్. 90 శాతం వైకల్యం ఉంది. మాకు అమ్మ, నాన్న లేరు. అన్నను నేను చూసుకుంటున్నాను. సదరం సర్టిఫికెట్ కావాలని అడిగితే అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. పుట్టపర్తి డీఎంహెచ్ఓ ఆఫీస్కు వెళ్లమని చెప్పారు. పలుమార్లు తిరిగినా వారు పట్టించుకోవడం లేదు. చాలా ఇబ్బంది ఉంది. మా అన్నకు పింఛన్ ఇప్పించండి సార్.

-సాయికుమార్, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: డీఎంహెచ్ఓతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తాం. పుట్టపర్తిలో కాకుండా అనంతపురంలోనే సదరం సర్టిఫికెట్ ఇప్పించి ఫించన్ ఇప్పిస్తాం.



కొత్తచెరువు నుంచి గోరంట్ల పల్లికి వెళ్లే రోడ్డు పనులు చేపట్టారు. అయితే కొంత వరకే చేసి వదిలేశారు. దీంతో దారి లేక ఇబ్బందులు పడుతున్నాం.

-శీనా, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్



నాగరాజు, పంచాయతీరాజ్ జేఈ: రహదారి పనులకు సబంధించి బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ అర్థంతరంగా పనులు ఆపేశారు. దీంతో రహదారి నిర్మాణం జరగలేదు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి స్పందిస్తూ ఉపాధి నిధులతో రహదారి, బ్రిడ్జి పనులు చేపట్టే విధంగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

పంచాయతీలోని సమస్యలు ఇవే



ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు, లైట్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి. వీధిలైట్లు లేకపోవడంతో మా పిల్లలు ట్యూషన్ నుంచి రాత్రి సమయంలో రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. వారిని పిలుచుకురావడానికి టార్చిలైట్ తీసుకుని వెళ్లాల్సి వస్తోంది.

- షాబీర



శ్రీనివాసరెడ్డి, ఈఓ: ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక లైట్లు వేయలేకపోయాం. అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపి మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే ఏర్పాటు చేయిస్తాం.



డ్రైనేజీ లేక రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండి మడుగును తలపిస్తోంది. దీంతో దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నాం. కుమ్మరకాలనీ నుంచి వేణుగోపాల్నగర్కు వెళ్లే రహదారి అక్రమ కట్టడాలతో కుంచించుకుపోయింది. ఈ సమస్యను పరిష్కరించాలి.

- కుళ్లాయప్ప

శ్రీనివాసరెడ్డి, ఈఓ: వేణుగోపాల్నగర్లో 300 మీటర్లు సీసీ రోడ్లు వేశాం. మిగిలిన 300 మీటర్ల సీసీరోడ్డుకు, డ్రైనేజీలకు ప్ర తిపాదనలు పంపాం. మంజురు కాగానే పను లు ప్రారంభిస్తాం. రెవెన్యూ అధికారులతో కలిసి కుంచించుకుని పోయిన రోడ్లను సర్వే చేయించి అక్రమ కట్టడాలను తొలగించి వెడల్పు చేస్తాం.



గ్రామంలో 120 రజక కుటుంబాలు ఉన్నాయి. ఇంతవరకు ఒక్క దోబీఘాట్ కూడా లేదు. వెంటనే దోబీఘాట్ను ఏర్పాటుచేయించాలి. అర్ధసెంటులో నివాసముంటున్నాం. మాకు ఇళ్లపట్టాలు కేటాయించాలి

- చాకలి సుబ్బరాయుడు, మాజీ వార్డు మెంబరు

డీటీ, ఈఓ: రెవెన్యూ అధికారుల తో కలిసి స్థలాన్ని గుర్తించి దోబీఘాట్ ఏర్పాటుకు కృషిచేస్తాం. ఇళ్లస్థలాలు లేనివారు దరఖాస్తులు చేసుకుంటే అర్హులైన వారికి స్థలాలను కేటాయించే విధంగా చూస్తాం.



బీసీ కాలనీలో ఆక్రమణలను తొలగించాలి. నెహ్రూ సర్కిల్ నుంచి ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను తొలగించాలి. వీటి వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- శేషాద్రినాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్

ఈఓ: బీసీకాలనీలో రోడ్లు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. మేము ఇది వరకే అక్రమ నిర్మాణాలు తొలగించుకోవాలని నోటీసులు ఇచ్చాం. మరోసారి సర్వే చేయించి ఆక్రమణలను తొలగిస్తాం. అదేవిదంగా పాఠశాలల ప్రహరీ పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాల యజమానులకు నోటీసులు పంపి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రెవెన్యూ అధికారులతో కలిసి చూపిస్తాం.



మాకాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు పారుతోంది. ఈ సమస్యను పరిష్కరించండి.

- పురాణం దివ్యతేజ, బీజేపీ లీగల్ సెల్ పార్లమెంట్ కో కన్వీనర్

ఈఓ: గ్రామంలోని సీసీరోడ్లకు ఇరు వైపులా డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టేందుకు రోడ్ల ను పరిశీలించాం. వాటికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే డ్రైనేజీలు నిర్మాణం చేపడతాం.

హంద్రీనీవా వెడల్పు పనులు

వేగంగా చేపట్టాలి

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ వెడల్పు పనులు వేగంగా చేపట్టాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం ఆయన హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు కింద 36ఏ ప్యాకేజీ, కాలువ వెడల్పు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కింద మల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు జరుగుతోందని, అందులో జంగిల్ క్లియరెన్స్ పనులు వేగంగా చేపట్టాలన్నారు. జంగిల్ క్లియరెన్స్‌కు ముందు, పనులు చేసిన తర్వాత డ్రోన్ ద్వారా ఫొటోలు తీయించాలన్నారు. అవసరమైన భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లించేం దుకు సీఎఫ్ఎంఎస్‌లో ఎక్కించాలని ఆదేశించారు. కాలువ వెడల్పునకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలన్నారు. భూసేకరణ ఎక్కడ వరకు ఉందో అక్కడ పెడ్ మార్కింగ్ చేయాలన్నారు. ఎక్కడ సమస్యలున్నాయో అక్కడ పెడ్ మార్కింగ్ చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కింద 33, 34 ప్యాకేజీలలో కూడా జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నియోజకవర్గంలో, ఇతర చోట్ల అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ వరప్రసాద్, హెచ్ఎన్ఎస్ఎస్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, గుంతకల్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌నాయక్, కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏపీ ఎస్సీ డీసీఎల్ కళ్యాణదుర్గం ఈఈ శేషాద్రి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

అనంతపురం అర్బన్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం రాత్రి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి సమీక్షించారు. నియోజకవర్గంలోని రహదారులను మూడు భాగాలుగా విభజించుకుని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదిరిపికొండ- ఉరవకొండ పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చిలోగా పనులు పూర్తి చేస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు.

జంబూరి ఉత్సవాలకు జిల్లా విద్యార్థులు



డైమండ్ జూబ్లీ జంబూరి ఉత్సవాలకు ఎంపికైన స్కౌట్స్ అండ్ గైడ్స్

కుందుర్పి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జరిగే డైమండ్ జూబ్లీ జంబూరి ఉత్సవాలకు జిల్లా నుంచి 13 మంది స్కౌట్స్ విద్యార్థుల, 19 మంది గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ హెడ్ క్వార్టర్స్ వారి ఆధ్వర్యంలో 75వ వార్షికోత్సవాలు తిరుచనాపల్లిలో జరగనున్నాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి, కార్యదర్శి బొమ్మయ్య మాట్లాడుతూ జాంబూరి అనేది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. భారత్‌దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా 25 వేల మంది పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, శైలజ, కమలాక్షి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి అరెస్ట్.. బెయిల్

పెద్దవడుగూరు, జనవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గూడూరు సూర్యనారాయణరెడ్డిని పెద్దవడుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో వెళ్లి హైదరాబాదులో ఉంటున్న సూర్యనారాయణరెడ్డిని గత అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించిన తర్వాత రిమాండ్‌కు తరలించారు. 2018లో ఉపాధి పథకం, 14వ ఆర్థిక సంఘం నిధులతో లక్ష్మీపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్ల పనులను అప్పేచర్ల గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి చేపట్టారు. అందుకు సంబంధించిన మొత్తం రూ.14,85,495. వైసీపీ అధికారంలోకి రావడంతో పంచాయతీ సెక్రటరీ మురళీకృష్ణారెడ్డి నిధులు కాజేశాడని జిల్లా కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేయగా, నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించి, పంచాయతీ సెక్రటరీని సస్పెన్షన్ చేశారు. దీంతో ఆయన మండల వైసీపీ వైసీపీ రైతు విభాగం మాజీ రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి తనపై ఒత్తిడి తెచ్చి, చెక్కులను తీసుకున్నట్లు అధికారులకు రాతమూలకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో ఎంపీడీఓ నరసింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈకేసు విషయంగానే సూర్యనారాయణరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఆయనకు గుత్తికోర్టు బెయిల్ మంజూరు చేసింది. వైసీపీ నాయకుడిని అరెస్ట్ చేశారనే సమాచారంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు మండలకేంద్రానికి చేరుకున్నారు. పోలీసులు అప్రమత్తమై ఎలాంటి సంఘటనలో చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.



బెయిల్‌పై విడుదలైన వైసీపీ నాయకుడు

పట్టించుకునేది ఎప్పుడో ?

చెరువులకు రక్షణ కరువు

కట్టలపై పెరిగిన కంప చెట్లు

మరమ్మతులు లేక తూముల నుంచి లీకేజీ



అరవకూరు చెరువు కట్టకు ఇరువైపులా పెరిగిపోయిన కంపచెట్లు



పొట్టి చెరువు తూము నుంచి లీకేజీ అవుతున్న నీరు

కూడేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయల కాలం నాటి చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కట్టలు, తూములు దెబ్బతింటున్నాయి. మండలంలో ఇప్పేరు, మరుట్ల, అరవకూరు, పొట్టి చెరువు, కరుట్లపల్లి, కొర్రకోడు చెరువుతోపాటు కూడేరు సమీపంలోని ఓబులయ్యకుంట, ముద్దలాపురం పర్క్యులేషన్ ట్యాంకులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఇప్పేరు, మరుట్ల, అరవకూరు, పొట్టి చెరువుల కింద ఆయకట్టు సాగు అవుతుంది. వర్షాలకు చెరువు నిండి నీరు నిల్వ ఉంటే ఆయకట్టు కింద రైతులు వరి, గోధుమ, జొన్న, రాగి తదితర పంటలు సాగు చేస్తారు. రాను రాను వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో చెరువులో నీరు నిల్వ లేకుండా పోయింది. దీంతో చెరువుల ఆలనా పాలన పట్టించుకోనే నాథుడే లేకుండా పోయారు. దీంతో చెరువు కట్టలకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వేర్లు చొచ్చుకుపోయి చెరువు కట్ట పటిష్టతను దెబ్బతీస్తున్నాయి. దీంతో చెరువులో నీరు నిల్వ చేస్తే దెబ్బతిన్న కట్ట నుంచి నీరు వృథాగా బయటకు వెళ్తోంది. దీనికి తోడు తూములు కూడా దెబ్బతినడంతో వాటి ద్వారా నీరు లీకవుతోంది. మరమ్మతుల గురించి ఎవరు , ఎప్పుడు పట్టించుకుంటారో తెలియని పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీ- నీవా, పీఏబీఆర్ నీటితో

చెరువులు కళకళ

హంద్రీనీవా, పీఏబీఆర్ నుంచి సమృద్ధిగా నీరు రావడంతో మండలంలో ఇప్పేరు, మరుట్ల, అరవకూరు, పొట్టిచెరువు, కరుట్లపల్లి, ముద్దలాపురం చెరువులు కళకళలాడుతున్నాయి. కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మండలంలోని అన్ని చెరువులను నీటితో నింపేందుకు శ్రద్ధ తీసుకున్నారు.

పెరిగిన ఆయకట్టు

మండలంలో చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూములు వరి పంటతో కళకళలాడుతున్నాయి. మరుట్ల చెరువు కింద 120 ఎకరాలు, అరవకూరు చెరువు కింద 340 ఎకరాలు, పొట్టి చెరువు కింద 141 ఎకరాలు, కరుట్లపల్లి చెరువు కింద 30 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. చెరువుల్లో నీరు ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో ఆయకట్టు పరిధిలోకి రాని వందల ఎకరాల భూమిలో పంటలు సాగు చేస్తున్నారు. ఆయా చెరువుల కింద వరి పంట పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. చెరువులో నీరు నిల్వ ఉండటంతో సమీపంలోని బోరు బావుల్లో నీరు పుష్కలంగా పెరగడంతో అన్నదాతలు చీనీ, దానిమ్మ, ద్రాక్ష, వేరుశనగ, కర్బూజ, కలింగర, దోస తదితర పంటలతోపాటు ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు.

● కట్ట వెడల్పు చేయాలి



పూర్వకాలంలో నిర్మించిన ఇప్పేరు చెరువుకట్ట చిన్నగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికితోడు కంప చెట్లు పెరిగిపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. గతంలో చెరువులో పూడికతీత పనులు చేశారు. దీంతో చెరువులో ఎక్కువ నీరు నిల్వ ఉంది. చెరువు కట్ట మరమ్మతులకు నిధులు అందించి కట్ట వెడల్పు చేస్తే అన్నదాతలకు పొలల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పుతాయి.

- రమణ, రైతు ఇప్పేరు గ్రామం

● కంప చెట్లు తొలగించాలి



అరవకూరు చెరువు కట్ట ఇరువైపులా కంపలు తొలగించాలి. చెరువులో నీరు నిల్వ ఉంటే ఆయకట్టుతోపాటు బోరుబావుల్లో నీరు సంవృద్ధిగా పెరిగి రైతులు పంటలు పండిస్తారు. ప్రస్తుతం చెరువు కింద ఆయకట్టు సాగు ఊపందుకుంది. రైతులు వరిపంట పెద్ద ఎత్తున్న సాగు చేస్తున్నారు. చెరువులో పూర్తి స్థాయి నీరు ఉంటే రెండు పంటలు పండించుకుంటాం. అందుకు ప్రభుత్వం చెరువు కట్టతోపాటు తూములు, మరవల మరమ్మతులకు నిధుల కేటాయించి పనులు చేయించాలి.

- రమేష్, రైతు కమ్మూరు గ్రామం

● నివేదికలు పంపాం



కూడేరు మండలంలోని చెరువుల మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ఒక్కొక్క చెరువుకు ఖరీఫ్ సీజన్‌లోపు ఐదు లక్షలతో పనులు చేయడానికి ప్రతి పాదన లు పంపిచాం. ఇప్పేరు చెరువుకు రూ.1.06 కోట్లు, పొట్టి చెరువుకు రూ.48లక్షలు, అరవకూరు చెరువుకు రూ.30 లక్షలు, మరుట్ల చెరువుకు రూ.42లక్షలు, కరుట్లపల్లి చెరువుకు రూ.60 లక్షలు కావాలని నివేదికలు పంపించాం. నిధులు రాగానే లీకేజీలు, కట్ట భద్రత, తూముల రిపేరీ తదితర పనులు పూర్తి చేస్తాం.

- సుధాకర్, ఏఈ, మైనర్ ఇరిగేషన్

నెత్తురోడిన రోడ్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. అలాగే ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో యువకుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటనల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ముగ్గురు యువకులు, ఓ మహిళ, వృద్ధురాలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
భర్తకు గాయాలు

గుత్తి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామశివారులో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీలత(38) మృతి చెందారు. కార్తీక్ గాయపడ్డాడు. ప్యాపిలి ఎస్ఐ మధుసూదన్ తెలిపిన మేరకు మేరకు శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన కార్తీక్, శ్రీలత దంపతులు కారులో హైదరాబాదు నుంచి సొంతూరికి వస్తున్నారు. పోతుదొడ్డి దగ్గరకు రాగానే కారు బోల్తా పడింది. దీంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీలత మృతి చెందింది. ఈ సంఘటపై ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైకు అదుపుతప్పి యువకుడు ...



సాయిరాం(ఫైల్)

డి.హీరేహాళ్ మండలంలోని హడగలి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో సాయిరాం(23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక బళ్లారి ప్రాంతానికి చెందిన ఆంజనేయులు కుమారుడు సాయిరాం రాయదుర్గం వైపు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. హడగలి గ్రామ సమీపంలో కుక్కను తప్పించే క్రమంలో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని బళ్లారి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

ఐషర్ ఢీకొని వృద్ధురాలు..

ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలోని కళ్యాణదుర్గం కూడలి వద్ద మంగళవారం ఐషర్ వాహనం ఢీకొని సుభద్రమ్మ(77) మృతి చెందింది. సుభద్రమ్మ రోడ్డు దాటుతున్న సమయంలో అనంతపురం నుంచి బళ్లారి వైపునకు వెళ్తున్న ఐషర్ వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఐషర్ వాహనం డ్రైవర్ పరారయ్యాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

యూపీ యువకుడు..

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం వద్ద గల నాసిన్ అకాడమీ క్యాంపస్‌లో జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడిన యుపీ యువకుడు ఆనంద్‌యాదవ్(18)హిందూపురం ఆసుపత్రిలో సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని మావ్‌జిల్లా కటిహారి గ్రామానికి చెందిన జిందుయాదవ్ కుమారుడు ఆనంద్‌యాదవ్ తన బంధువైన రవికుమార్‌ను కలిసేందుకు వచ్చాడు. రవికుమార్ నాసిన్ అకాడమీలో కూలీగా పని చేస్తున్నాడు. అకడమీలో సోమవారం కలిసిన ఇద్దరూ ద్విచక్రవాహనంపై నాసిన్ క్యాంపస్‌లోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. వాహనాన్ని నడుపుతున్న ఆనంద్‌యాదవ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి బిందుయాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ బోల్తా పడి యువకుడు...
- మరో యువకుడికి గాయాలు

గుత్తి మండలంలోని రజాపురం గ్రామ శివారు 67వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి పవన్ (25) మృతి చెందాడు. మరో యువకుడు గాయపడ్డాడు. టీ. కొత్తపల్లి గ్రామానికి చెందిన చాకలి పవన్, కడియల పవన్ ఇద్దరు కలిసి బైక్‌పై గుంతకల్లుకు వెళ్లి గుత్తికి వస్తుండగా రజాపురం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చాకలి పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కడియాల పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రామదాసుపేట వద్ద యువకుడు...



శర్మాష్‌వలి (ఫైల్)

గార్లదిన్నె మండలంలోని రామదాసుపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐషర్ వాహనం డ్రైవర్ శర్మాష్‌వలి (20) దుర్మణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు అనంతపురం రూరల్ మండలం కొడిమి కొట్టాలకు చెందిన దస్తగిరమ్మ, ఎర్రిస్వామి దంపతుల కుమారుడు శర్మాష్‌వలి ఐషర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి పామిడి వైపు నుంచి అనంతపురం వైపు బయల్దేరాడు. రామదాసుపేట సమీపంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. శర్మాష్‌వలి ద్విచక్ర వాహనాన్ని ఏదైనా వాహనం ఢీ కొట్టిందా...? లేక ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిందా...? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నార్పల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం మధ్యాహ్నం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దాదాపు 45సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం నరసాపురం సమీపంలో లభించింది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహంపై నీలం రంగు డ్రాయర్, గళ్ల లుంగీ, చొక్కా ఉన్నాయి. ఎవరైనా గుర్తిస్తే నార్పల పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సాగర్ తెలిపారు. మృతదేహాన్ని అనంతపురం వైద్యకళాశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

రాప్తాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో అనంతపురం నగరానికి చెందిన యువకుడు జయచంద్ర (25) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... నగరానికి చెందిన లక్ష్మయ్య, రత్నమ్మల కుమారుడు జయచంద్ర బెంగళూరులో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జయచంద్ర మృతదేహం రైలు పట్టాలపై పడి ఉండటాన్ని మంగళవారం రైల్వే పోలీసులు గమనించారు. మృతుడి సెల్‌ఫోన్ ట్రూ కాలర్ ఆధారంగా జయచంద్ర అని గుర్తించారు. అవివాహితుడైన జయచంద్ర మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టమోటా కిలో రూ.16



అనంతపురం రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 9 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 15వేలు



అనంతపురం రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 11వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం ఆరు టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

ఒకటో తేదీనే పింఛన్: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఒకటో తేదీన పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్‌డీఏ అధికారులు, ఏపీఎంలు, బ్యాంకు, మండల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టరు కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జనవరి నెల పింఛన్లను ఫిబ్రవరి ఒకటో తేదీనే పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెల్లడించారు. పింఛన్లకు సంబంధించిన డబ్బును ముందుగానే బ్యాంకుల నుంచి డ్రా చేసి, పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఒకటిన ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ మొదలు పెట్టి మధ్యాహ్నానికి పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్ అందించాలన్నారు. ఎక్కడ నుంచి జియోట్యాగ్ చేశారో అక్కడకు వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. మండల స్థాయిలో కంట్రోల్‌రూమ్‌లు ఉదయంనుంచే ఏర్పాటుచేయాలని స్పెషల్ అధికారులకు ఆదేశించారు. అదేరోజు ఆయామండలాలలో జరుగుతున్న అబివృద్దిపనులను పరిశీలించాలన్నారు. ఇళ్లనిర్మాణాలు పూర్తి అయిఉంటే లబ్దిదారులకు తాళాలు అందించాలని కలెక్టరు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏపీడీ ఈశ్వరయ్య, ఎల్డీఎం నరసింగరావు,హౌసింగ్‌పీడీ శైలజ, జడ్పీడిప్యూటీ డీఈఓ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 902 క్యూసెక్కులు

బెళుగుప్ప, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 902 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 463 క్యూసెక్కులు వెళుతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని అధికారులు వెల్లడించారు.

పరిష్కారమే అజెండాగా..

ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ప్రజాపరిష్కార వేదికకు భారీ స్పందన



సమావేశానికి హాజరైన ప్రజలు

కొత్తచెరువు/పుట్టపర్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా - పరిష్కారమే అజెండాగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వ ర్యంలో చేపట్టిన ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. వేదిక దృష్టికి వచ్చిన ముఖ్య సమస్యలు..



● వేణుగోపాల్‌నగర్‌లో దేవాయాలకు స్థలం కేటాయించాలి. **- భాస్కర్, చైర్మన్, ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల.**

● సమాధానం: ఈఓ: కాలనీలో రెవెన్యూ అధికారు లతో కలిసి పర్యటించి ఆలయాల నిర్మాణానికి స్థలం కేటాయిస్తాం.



● రాముడి గుడి నిర్మాణం చేపట్టాం. నీటి సౌకర్యంలేక మధ్యలో ఆపేశాం. కాలనీలో తాగు నీటి ట్యాంక్ నిర్మించారు. గంట అయినా బిందె నీరు రావు. దీంతో ఇబ్బందుల పడుతున్నాం.

- నాగలక్ష్మీ, నాగేష్, విజయనగరకాలనీ

● సమాధానం: ఈఓ: విజయనగర్ కాలనీలో ఇటీవలే తాగునీటి ట్యాంక్‌లను నూతనంగా నిర్మించాం. తాగునీటి సమస్య లేకుండా ట్యాంక్ ఎత్తు పెంచి నీరు సమృద్ధిగా వచ్చేలా చూస్తాం. ఆలయ సమీపంలో కూడా స్థలం ఉంటే నీటి ట్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.



● ప్రార్థన మందిరానికి మురుగు నీటిలో వెళ్లాల్సి వస్తోంది. డ్రైనేజీ కాలువలను సైతం ఆక్రమించారు. మురుగునీరు రోడ్లపై పారుతోంది. కొంతమంది బాత్‌రూం పైపులను రోడ్లపైకి వది లారు. సమస్య పరిష్కరించండి: **- మాణిక్యం షౌకత్**

● ఈఓ: దర్గా వీధిలో ఇటీవల జాయింట్ కలెక్టర్ కూడా పర్యటించారు. రోడ్లను, డ్రైనేజీ కాలు వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసి అక్రమ కట్టడాలను తొలగించాలని జేసీ సైతం ఆదేశించారు. అక్రమ కట్టడాలు నిర్మించినవారికి నోటీసులు ఇటీవలే జారీ చేశాం. బాత్‌రూం పైపులు రోడ్లపైకి ఏర్పాటుచేసుకున్న వారికి కూడా నోటీసులు జారీ చేశాం. వారు స్పందించకపోతే మా సిబ్బందితో వాటిని తొలగిస్తాం.



● మా ఇంటికి వెళ్లే దారిని ఆక్రమించారు. అధికారుల వద్దకు వెళ్లితే న్యాయం చేయలేదు:

- దూదేకుల బాబు: ఎర్రపల్లిగ్రామం

● డీటీ: ఎర్రంపల్లి గ్రామంలో దారి సమస్యపై రెండు రోజుల కిందటే వెళ్లి సర్వే చేయించాం. వడ్డే శివయ్య దారిని ఆక్రమించింది వాస్తవమే. ఆయన స్థలం కొన్నానంటూ అడ్డుకుంటూ కోర్టుకు వెళ్లాడు. మరోసారి పోలీసుల సాయంతో ఆ సమస్యను పరిష్కరిస్తాం.



● జగనన్న కాలనీలో అనర్హులకే రెండు, మూడు పట్టాలు ఇచ్చారు. అర్హులకు అన్యాయం చేశారు. సర్వే చేయించి అర్హులకు న్యాయం చేయాలి

- వడ్డే పాపన్న

● డీటీ: జగనన్న లేఔట్లలో ఖాళీలు ఉన్నది వాస్తవమే. కొన్ని పట్టాలు అనర్హులకే అందాయి. ఒక్కొక్కరు రెండు, మూడు పట్టాలు చేయించుకున్నారు. వాటిని పరిశీలించి అర్హులకు అందేలా న్యాయం చేస్తాం.



● కేశాపురంలో సబ్‌స్టేషన్ ఉన్నా లో ఓల్టేజ్ సమస్య ఉంది. ఈ సబ్‌స్టేషన్ నుంచి చెన్నేకొత్తపల్లి మండలంలోని మూడు గ్రామాలకు విద్యుత్ సమస్య ను సరఫరా చేస్తున్నారు. దీంతో మాకు లో ఓల్టేజ్ సమస్య తప్పడం లేదు.

- లక్ష్మీనారాయణరెడ్డి, కేశాపురం

● శివరాం, ట్రాన్స్‌కో ఈఈ: సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అక్కడ లో ఓల్టేజ్ సమస్య లేకుండా చర్యలు చేపడుతాం.

● ప్రభుత్వ బాలుర పాఠశాలకు వాటర్‌ప్లాంటు కోసం త్రిఫేజ్ కనెక్షన్ ఇవ్వాలి.

- భాస్కర్, స్కూల్ కమిటీ చైర్మన్

● వెంకటేశ్‌నాయక్, ట్రాన్స్‌కో ఏఈ: ఎస్టిమేషన్ వేశాం. డీడీ కట్టగానే విద్యుత్ కనెక్షన్ ఇస్తాం.



● ఎల్-1,2,3 కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక కట్టెలపై లైన్లు లాక్కున్నాం. స్తంభాలను ఏర్పాటు చేయించండి: వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. **-షాబీర, కుళ్లాయప్ప**

● ఎమ్మెల్యే: మూడు కాలనీలలో ఎక్కడెక్కడ విద్యుత్ స్తంభాలు లేవో విద్యుత్ అధికా రుల తో సర్వే చేయించి, స్తంభాలను ఏర్పాటు చేయించి, విద్యుత్ లైట్లను కూడా ఏర్పాటు చేయిస్తాం. ట్రాన్స్‌కో, పంచాయతీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలి.



● వంగంపల్లి బ్రిడ్జి నుంచి గ్రామంలోకి సీసీ రోడ్డును వేయించండి.**- జయరాం,మాజీ ఎంపీటీసీ.**

● పీఆర్ జేఈ: వంగంపల్లి బ్రిడ్జి నుంచి గ్రామం లోకి సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే సీసీరోడ్డు నిర్మాణం చేపడుతాం.



● చనిపోయిన వారి కుటుంబాలకు చేపల సంఘంల సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలి. కమ్యూనిటీ భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

- మురళి, చేపల సంఘం అధ్యక్షుడు

● ట్రాన్స్‌కో ఈఈ శివరాం, అశోక్, ఫిషరీస్ అసిస్టెంట్: స్కిల్ పరీక్షలు చేసి సొసైటీ సభ్యత్వం ఇస్తాం. చెరువు లీజు ద్వారా రూ.1.6లక్ష వస్తోంది. 50 శాతం సాగునీటి సంఘాలకు, 30శాతం పంచాయతీకి, 20శాతం మత్స్యశాఖకు చెల్లిస్తున్నాం. ఖర్చు భరిస్తే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తాం. చేపల సంఘంలో సభ్యత్వం బోయ, బెస్త వాళ్లకే ప్రాధాన్యం ఇవ్వాలి.



● ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. ఇండోర్ స్టేడియం లేక క్రీడాకారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టాలి.

- సుబ్రహ్మణ్యం, మెడికల్ స్టోర్ యజమాని

● ఇందిర, సీఐ: నాలుగు రోడ్ల సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్య ఉన్నది వాస్తవమే. దుకాణాదారులు వా షాపుల వద్ద ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయించరాదు. డివైడర్‌పై ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులకు రెవెన్యూ అధికారులు మరో ప్రాంతంలో స్థలం చూపితే సమస్య పరిష్కారమవుతుంది.

● ఎమ్మెల్యే అధికారులతో సంప్రదించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఎంత మేరనిధులు అవసరమవుతాయే తెలుసుకుని నిధులను కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

కార్యక్రమంలో ఎంపీడీఓ నటరాజ్, డీటీ బాలాంజనేయులు, ట్రాన్స్ ఈఈ శివరాం, ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్, సీఐ ఇందిరా, పీఆర్ జేఈ నాగరాజు, ప్రభుత్వ వైద్యులు అశ్వర్థకుమార్, పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ సుమనానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఓబులేసు, ఏఓ నటరాజ్, ఎంఈఓ జాన్‌రెడ్డప్ప, ఏపీఓ నాగిరెడ్డి, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు, మండల పట్టణ కన్వీనర్‌లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, సాగునీటిసంఘం అధ్యక్షుడు నవీన్ కుమార్, నాయకులు సామకోటి ఆదినారాయణ, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, శ్రీనివాసచౌదరి, నల్లమాడ శంకర్, సమితి చంద్ర, బండ్లపల్లిరాజు, లోచర్ల పెద్దన్న, బీజేపీ నాయకులు శేషాద్రినాయుడు, గంగానాయుడు జనసేన నాయకులు పూల శివప్రసాద్, అబ్దుల్ పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయండి సార్..!

దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని రహదారి

నల్లమాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటకుంటపల్లి నుంచి కదిరి వెళ్లే ఒకటిన్నర కిలోమీటర్ ఉన్న లింక్ తార్ రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఈ మార్గం ద్వారా వెళ్లాలంటే వాహనదారులు హడలిపో తున్నారు. ఈరోడ్డు నిర్మించి దాదాపు 20 ఏళ్లు గడుస్తున్నా.. ఒకసారి కూడా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. గతంలో కదిరి నుంచి నల్లమాడకు వెళ్లే బస్సులు ఈరోడ్డు గుండానే వెళ్లేవి. ఈరోడ్డు పూర్తిగా దెబ్బతి నడంతో ఈరోడ్డు గుండా బస్సుల రాకపోకలను ఆర్టీసీ అధికారులు బంద్ చేశారు. ఈరోడ్డు మార్గన వచ్చే బస్సులు కదిరి నుంచి దొన్నికోట మీదుగా ఎద్దులవాండ్లపల్లి తండా మీదుగా వెళ్తున్నాయి. వచ్చే ఒకే ఒక బస్సు రోడ్డు పాడుకావడంతో అది కూడా తండా మీదుగా వెళ్తోంది. పాలకులు, అధికారులు స్పందించి ఈరోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



చౌటకుంటపల్లి నుంచి దొన్నికోటకు వెళ్లే రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం

గాండ్లపెంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమతంపల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు, విద్యుత్ వైర్లకు పచ్చని తీగలు అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడినప్పుడు పచ్చని ఆ తీగల ద్వారా విద్యుత్ ప్రవహించి.. పెను ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్, వైర్లకు అల్లుకున్న తీగలు

ఆయుధాలపై పరిజ్ఞానం అవసరం: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, ఆర్మ్‌డ్ రిజర్వుడు సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ వీ.రత్న పేర్కొన్నారు. మంగళవారం ఈమేరకు బుక్కపట్నం మండలం చంద్రాయినిపల్లిలో జనవరి 17 నుంచి ఫిబ్రవరి 3 వరకు నిర్వహిస్తున్న.. మొబలైజేషన్ ఫైరింగ్‌ను ఎస్పీ మంగళవారం పర్యవేక్షించారు. ఫైరింగ్ రేంజ్ శిక్షణా కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు మహేష్, వలి, ఎస్పీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఎస్సైలు ఆర్మ్‌డ్‌రిజర్వుడు సిబ్బంది పాల్గొన్నారు.

● అక్రమ కేసును ఎత్తివేయాలి

పుట్టపర్తిరూరల్: కదిరి పట్టణానికి చెందిన్న దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడెసె దేవానంద్‌పై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎంఆర్‌పీఎస్ ఎస్సీ ఎస్టీ దళిత సంఘా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ ఎస్సీ ఎస్టీ దళిత సంఘాల నాయకులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్నను కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామి మాట్లాడుతూ.. గుడెసె దేవానంద్, ఓ వర్గానికి చెందిన మహిళ మధ్య స్థల వివాదం ఉందని, దానిపై కోర్టులో విచారణ సాగుతోందని అన్నారు. అయినా ఓ ప్రజాప్రతినిధి అండతో పూర్వపరాలు పరిశీలించకుండా గుడెసె దేవానంద్‌పై కేసు నమోదు చేశారన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్పీని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల ఎమ్మార్పీస్ అధికార ప్రతినిధి అక్కులప్ప, అనంతపురం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు బండారు చంద్ర, సత్యసాయిజిల్లా అధ్యక్షుడు గంగాద్రి, నాయకులు శ్రీనివాసులు, ఎంఎస్‌ఎఫ్ నాయకులు నగేష్, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామి అనంద్ పాల్గొన్నారు.



ఆయుధాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

అంకిత భావంతో ప్రజాసేవ చేయండి: ఎమ్మెల్యే

కదిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అకింత భావంతో ప్రజాసేవ చేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన టీడీపీ పట్టణ నాయకులతో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు కచ్చితంగా గుర్తిస్తామన్నారు. పార్టీలను అడ్డం పెట్టుకుని భూకబ్జాలకు పాల్పడితే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. పట్టణంలోని దేవానంద్‌కాలనీ, బంగారు లక్ష్మణ్‌కాలనీలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే విచారణకు ఆదేశించామన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నిజాలు తెలుసుకోవాలని కోరారు. అనంతరం వార్డుల వారీగా సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ ఫర్వీనాభాను, పట్టణాధ్యక్షుడు ఇర్షాన్, కౌన్సిలర్లు అల్లాముస్తఫా, సావిత్రమ్మ, రంగారెడ్డి, ఎంఎస్ ఫయాజ్, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, కొమ్మినేని గంగయ్యనాయుడు, క్రిష్ణమోహన్‌నాయుడు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట



మాట్లాడుతున్న న్యాయవాది

న్యాయవిజ్ఞాన సదస్సు

తాడిమర్రి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాజ్యోతి మండల సమాఖ్యలో మహిళ న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ధర్మవరం న్యాయవాదులు బాలసుందరి, భార్గవి, పవన్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగరావు, సీడీపీఓ సరస్వతి, ఏపీఎంలు హరిప్రసాద్, సాంబశివుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కొత్తచెరువు జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు స్థానిక విద్యాశాఖ ఏడీ-2 రామక్రిష్ణకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. హిందూపురం మున్సిపల్ పరిధిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని, ప్రస్తుతం బీఈడీ చేస్తున్న ఉపాధ్యాయులకు టీచింగ్ ప్రాక్టీస్ కోసం అనుమతించాలని, 2018 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్‌కు హాజరైందుకు సెలవులు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, హిందూపురం అధ్యక్షుడు షమీవుల్లా, ప్రధాన కార్యదర్శి రాము, వసీన్, శ్రీనివాసులు, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరిక

ధర్మవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక లోనికోటకు చెందిన కౌన్సిలర్ రమాదేవి, జనసేన నాయకులు తొండమాల రవి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 200 కుటుంబాల సభ్యులు జనసేన పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి వీరు జనసేనలోకి చేరారు. కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వాసగిరి మణికంఠ, పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్, నాయకులు బెస్త శ్రీనివాసులు, డిష్‌రాజు, తోపుదుర్తి వెంకటరాముడు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు

కదిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక అమీన్‌నగర్‌లో నివాసముంటున్న ఓ వివాహిత డ్వాక్రా సంఘంలో రూ.నాలుగు లక్షలు సొంతానికి వాడుకుంది. ఆ డబ్బును తాను కడతాని, తన కోరిక తీర్చాలని చింతకుంట మాబూ వేధిస్తున్నట్లు ఆమె మంగళ వారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు ప్రారంభించామని సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

పిల్లల పెంపకంపై అవగాహన

పుట్టపర్తిరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా సమాఖ్య భవనంలో తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల అనుసరించాల్సిన దృక్పథం అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు యాంత్రిక జీవనంలో మునిగిపోవడంతో పిల్లలు ప్రేమానురాగాలు, ఆప్యాయతకు దూరమైన ఒంటరిగా ఉంటున్నారన్నారు. తల్లిదం డ్రులు ఎంత బిజీగా ఉన్నా పిల్లలతో గడపటానికి తగిన సమయం కేటాయించారన్నారు. ఇందులో సీఐఎఫ్ ప్రతినిధి కొండప్ప, డీఆర్డీఏ డీపీఎం లలిత, ఏరియా కో-ఆర్డినేటర్ పద్మావతి, డీసీపీయూ ప్రొటెక్షన్ అధికారి మురళి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ




మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరంరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిగడ్డపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీఓ మహేష్ మంగళవారం తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని భోజన ఏజెన్సీ వాళ్లకు సూచించారు. విద్యార్థులకు సకాలం లో భోజనం పెట్టకపోయినా, మెను పాటించకపోయినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్నభోజన నాణ్యతను ఉపాధ్యాయులు తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

● ఫిర్యాదులపై విచారణ

ముదిగుబ్బ: ఇటీవల కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వచ్చిన పొలం వివాదంపై ఆర్డీఓ మహేశ్ విచారణ చేపట్టారు. ఆయన మండలంలోని ముక్తాపురం గ్రామంలో మంగళ వారం పర్యటించారు. గ్రామంలోని సర్వేనెంబరు 636-1 సర్వేనెంబర్ లోని బిల్లే పెద్దన్న భూములను సర్వే చేయించి కొలతలను గుర్తించారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అధికారులు

ఓబుళదేవరచెరువు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిలపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అటవీశాఖా ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. అడవికి నిప్పు పెట్టడం వలన కలిగే నష్టాలు, అడువుల సంరక్షణ బాధ్యతపై పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు అటవీ శాఖ రేంజ్ అధికారి యామినీసరస్వతి బహుమతి అందించారు. కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ అధికారి చంద్రనాయక్, బీట్ అధికారులు రామక్రిష్ణ, రాహుల్, పాఠశాల కమిటీ చైర్మన్ మావిటి రాజేష్, మల్లెల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన గానామృతం

పుట్టపర్తి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యార్థులు మధుర గానంతో భక్తులను అలరింపజేశారు. విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా 10, 12వ తరగతి విద్యార్థులు మంగళవారం సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో సత్యసాయికి భక్తి నివేదం పేరిట భక్తిగీతాలు ఆలపించారు. సంగీత, నృత్యంతో భక్తులు తన్మయం పొందారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



భక్తిగీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

న్యూస్ బాక్స్

మాజీ ఎమ్మెల్యే అనంతరెడ్డికి ఘన నివాళి



అనంతరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

బత్తలపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యవంతంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనంతరెడ్డి వర్థంతిని మంగళ వారం నిర్వహించారు. ఆయన కుమారుడు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ డైరక్టర్ గోనుగుంట్ల విజయకుమార్, కుటుంబ సభ్యులతో కలసి అనంతరెడ్డి ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, సత్యం సిటీ స్కాన్ అధినేత జొన్నసత్యనారాయణ, నారాయణరెడ్డి, ఏడీసీసీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, రమణ, టీడీపీ కార్యకర్తలు నివాళులర్పించారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : టీడీపీ

ముదిగుబ్బ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. మంగళవారం మండలం లోని గంగిరెడ్డిపల్లి గ్రామంలోమ ఆయన పర్యటించారు. గ్రామం లో సమస్యలపై ఆరా తీశారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణిం చిన టీడీపీ కార్యకర్త సాకే హరి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, కోట్లబాబి, వినోద్‌బాబు, నరసింహ యాదవ్, వీరనారప్ప, ఆదిశేషు, శివయ్య, శ్రీనివాసులు ఉన్నారు.



సమస్యలు ఆరాతీస్తున్న పరిటాల శ్రీరామ్

● బాధిత కుటుంబానికి పరామర్శ

బత్తలపల్లి: బత్తలపల్లికి చెందిన తోలుచూరి చరణ్ ఈనెల 23న అనంతపురం నారాయణ కళాశాలలో భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. బాధిత కుటుంబాన్ని పరిటాల శ్రీరాం పరామర్శించారు. ఆయన వెంట ఘటాపురం జగ్గు, రమణ, శ్రీరాములు, సదాశివ, అప్పస్వామి, అశోక్ ఉన్నారు.

బాలకృష్ణకు పురస్కారంపై హర్షం

పుట్టపర్తి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించడంపై తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ , నాయకుల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సత్యమ్మ దేవాలయం వద్ద బాలకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణ్, బీమినేని కిష్టప్ప, బేకరినాయుడు, శ్రీనివాసులు, రామప్ప, చిన్నవెంకటరాముడు, నరసింహులు, రాజప్ప, మనుమంతరెడ్డి భాషా పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

తనకల్లు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గేమేనాయక్ తండా పంచాయతీ మొగిలిచెట్ల తండాకు చెందిన బూక్యా తులసమ్మ అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు సీఎం సహాయనిధి నుంచి రూ.37,378 మంజూరైంది. ఆ చెక్కును ఆ గ్రామ సర్పంచ్ మూడే కాంతమ్మ బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం అందచేశారు. ఇందులో మాజీ కన్వీనర్ బీగం శంకర్‌నాయుడు, నాయకులు మూడే ఉత్తన్ననాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీరాములనాయక్, జయకుమార్ నాయక్, బూత్ కన్వీనర్ బాలాజీ నాయక్, ఎస్టీసెల్ శంకర్‌నాయక్, రమేష్ నాయక్, రజిత్‌నాయక్, నరేంద్రనాయక్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో జీవితం బుగ్గి

కదిరి అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను వాడడం ద్వారా అనేక రుగ్మతుల బారిన పడి జీవితం బుగ్గిపాలవుతుందని పొగాకు నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. జాతీయ పొగాక నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో పొగాకు వాడకంతో వచ్చే రుగ్మతులపై అవగాహన కల్పించారు. బీడి, సిగరెట్ వ్యసనాలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనురాధ, సామాజిక కార్యకర్త శమతకమణి, పీడీ సిబ్బంది శ్రీనివాసులు, ఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల ఎంపికకు సర్వే

నంబులపూలకుంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ప్రభుత్వం పింఛన్ కోసం 31 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ పింఛన్‌దారుల ఎంపికకు ఈఓఆర్డీ మాధవరెడ్డి, మండల వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి మంగళవారం సర్వే చేశారు. ఎన్పీకుంట, పి.కొత్తపల్లి, పెడబల్లి సచివాలయ పరిధిలో 14 మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరిశీలించామని, మిగిలిన వారిని బుధవారం పరిశీలిస్తామని ఈఓఆర్డీ తెలిపారు.

భరతమాత చిత్రపటాల పంపిణీ

గాండ్లపెంట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగలవారిపల్లి గరుడాంజనేయస్వామి ఆలయంలో ఏకోపాధ్యాయ ఆధ్వర్యంలో అనంత సమితి సభ్యులు ఆచర్యులు, మాతాజీలకు ఏరూపదుస్తులు, భతరమాత, సరస్వతిదేవి చిత్రపటాలను మంగళవారం అందచేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, ఆచార వ్యవహారాలు, దేశం గురించి నేర్పించాలన్నారు. విదేశీ సంస్కృతిని విడనాడి, భాతర సంస్కృతిని అలవాటు చేసుకునేలా నేర్పించాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రావు, ప్రసాద్, రాజేశ్వరీ, గంగాయ్యయాదవ్, వెంకటేష్, మధుసూధన్‌రెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మందుగుండు పరిశ్రమ ఏర్పాటుపై సమావేశం



రైతులతో సమావేశమైన ఆర్డీఓ ఆనందకుమార్

మడకశిరటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆర్.అనంతపురం వద్ద మందుగుండు సామాగ్రి పరిశ్రమ ఏర్పాటులో భాగంగా మంగళవారం పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో ఆ గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడంతోపాటు పరిశ్రమ ఏర్పాటు చేయడంపై రైతులతో చర్చించారు. ఇప్పటికే ఆర్.అనంతపురం, గౌడనహళ్లి గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ వారు 1500 ఎకరాల భూమిని సేకరించి రైతులకు సైతం నష్టపరిహారాన్ని అందించారు. సీఎం చంద్రబాబు మడకశిర మండలంలో పరిశ్రమ నెలకొల్పేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగా ఆర్డీఓ రెండు గ్రామాల రైతులతో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై చర్చించి వారి అభిప్రాయాలు తెలుసుకొన్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ కరుణాకర్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కట్టినా.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వరా..?

అగళి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్వీస్ కోసం డబ్బులు చెల్లించి రెండేళ్లయినా, నేటికీ ఇవ్వలేదని రైతు సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అగళి మండలం హెచ్‌డి హళ్లి గ్రామానికి చెందిన రైతులు సురేష్, రామ్‌జీనాయక్, మంజునాథ్ నాయక్, వెంకటేశ్‌నాయక్, రేఖనాయక్, బాలాజీనాయక్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సర్వీస్ కోసం డబ్బులుచెల్లించి రెండు సంవత్సరాలు గడిచినా నేటికి విద్యుత్ అధికారులు సర్వీసులు బిగించలేదని వారు వాపోయారు. బోరు బావులలో నీరు పుష్కలంగా లభించడంతో గతంలో పనిచేసిన ఏఈలకు డబ్బులు చెల్లించామని అయినా నేటికీ సర్వీసులు ఇవ్వలేదన్నారు. తూతూ మంత్రంగా ఒక్కొక్కరికి మూడు విద్యుత్ పోల్స్ ఇచ్చారని సర్వీస్‌గాని ట్రాన్స్‌ఫార్మర్ డబ్బాగాని ఇవ్వలేదన్నారు. దీనిపై మడకశిర ఏడీ నాగన్న మాట్లాడుతూ, విద్యుత్ సర్వీసుల కోసం డబ్బులు చెల్లించిన వారికి సీనియార్టీ ప్రకారం అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం వైరు, ట్రాన్స్‌ఫార్మర్లు లేవని, వచ్చిన వెంటనే సీనియారిటీ ప్రకారం అందజేస్తామన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

పరిగి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడేటి గ్రామంలో జయమంగళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ రంగడు యాదవ్ సీజ్ చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గణపతిపల్లికి చెందిన రామాంజినప్ప అనే ఇసుక వ్యాపారస్థుడు నియమ నిబంధనలు పాటించకుండా ప్రభుత్వ అనుమతి పొందకుండా ఇసుక తరలిస్తున్నారు. స్థానికులు ఈ విషయాన్ని తెలియజేయడంతో ఘటనా స్థలాన్ని చేరుకుని ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు.

రోడ్డుపక్కన విద్యుత్ స్తంభాలు తొలగించండి

పెనుకొండ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి గ్రామం నుంచి రిజర్వాయర్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌స్తంభాలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇటీవలే బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో గొల్లపల్లి నుంచి రిజర్వాయర్ వద్దకు వెళ్లేందుకు రూ.2కోట్లతో సీసీరోడ్డు నిర్మించారని, ఈ క్రమంలో గొల్లపల్లి నుంచి రిజర్వాయర్‌కు వెళ్లే దారిలో మలుపువద్ద విద్యుత్ స్తంభాలుండటంతో ఎప్పుడేం ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మలుపులవద్ద ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు జరపాలని స్థానికులు కోరుతున్నారు.

మడకశిర ఉప కాలువకు మరమ్మతులు



మడకశిర ఉప కాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిరకు వెళ్లే ఉప కాలువకు త్వరలో నీరు విడుదల చేయనున్నందున హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు కాలువ మరమ్మతులు చేపట్టారు. మంగళవారం ఎక్సకవేటర్ సాయంతో మడకశిర ఉప కాలువలో పెరిగిన ముళ్లపొదలు, చెట్లను తొలగించి శుభ్రతా పనులు చేపట్టారు. గొల్లపల్లి రిజర్వాయర్ కెపాసిటీ 1.9 టీఎంసీలుకాగా 1.72 టీఎంసీలు నీరు నిలువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రాగిమేకలపల్లిలో పొలం పిలుస్తోంది

గోరంట్ల, జనవరి28(ఆంధ్రజ్యోతి):మండలంలోని పాలసముద్రం పంచాయతీ రాగిమేకలపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు మంగళవారం నిర్వహించారు. ఏఓ మునిక్రిష్ణ రాగిమేకలపల్లి రైతు శ్రీనివాసుల పొలంలో రాగి, కంది పంటపై సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. రాగిపంటను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. కనీస మద్దతు ధర క్వింటాలు రూ.4,290గా ప్రకటించారన్నారు. కావున రైతులు రాగి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటిపట్టాలు

పెనుకొండ టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ ఇంటి పట్టాలు రానున్నాయని కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. రూ.5కే అందిస్తున్న అన్నా క్యాంటిన్ సేవలు మంగళవారానికి 587వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలైన అర్హులను గుర్తించే పనిలో అధికారులున్నారని ఇళ్లులేని నిరుపేదలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలంతోపాటు గృహనిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టనున్నట్లు తెలిపారు.

విద్యుత్ లో ఓల్టేజీతో సతమతం



అమరాపురం వద్ద తెగి నేలపై పడి ఉన్న 11 కేవీ వైర్

● కాలిపోతున్న మోటార్లు, స్టార్టర్లు
● ఆందోళనలో రైతులు ● పట్టించుకోని అధికారులు

వేసవి ఇంకా ప్రారంభం కాలేదు. అప్పుడే గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్య ప్రారంభమైంది. తిరుగుతూ ఉన్న మోటారు హఠాత్తుగా కాలిపోతుంది. దానిని రిపేరు చేయిద్దామంటే సమయానికి మెకానిక్ రాడు. అతడొచ్చి మామూళ్లు పుచ్చుకుని రిపేరు చేయించి మళ్లీ మోటారు పనిచేయడానికి ఎంతలేదన్నా వారం రోజులు పడుతుంది. అప్పుడైనా పనిచేస్తుందన్న గ్యారంటీ లేదు. మళ్లీ లోఓల్టేజీ వస్తే చేసేదేమీ లేదు. ఇంతలో పంట నీరు లేక ఎండిపోతుంది. మరోవైపు నదుల్లో ఎన్నో టీఎంసీల నీరు వృథా పోతోంది. వాటిని రైతుకు అందించే చిత్తశుద్ధి ప్రభుత్వాలకు లేకపోవడంతో వ్యవసాయ యుద్ధంలో రైతు నలిగి సతమతమవుతున్నాడు. పట్టణంలో ఇంటింటి నుంచి చెత్తసేకరించే ప్రభుత్వాలు అన్నంపెట్టే రైతుల మోటార్లను రిపేరు చేయించలేవా? లేక విరివిగా సోలార్ మోటార్లు ఇవ్వలేరా? మంగళవారం ఒక్కరోజే అమరాపురం, అగళి, రొళ్ల మండలాల్లో లోఓల్టేజీపై రైతులు ఆందోళన చేశారు.

అమరాపురం: మండలంలోని కెంకెర, కాచికుంట గ్రామాల్లో దాదాపు రెండు నెలల నుండి లోఓల్టేజీ సమస్యతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గత 20 రోజుల క్రితం విద్యుత్ అధికారి సిద్దేశ్వరను సంప్రదించగా రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పినా ఆయన ఇంతవరకు ఏమాత్రం స్పందించలేదు. మరోవైపు విద్యుత్ వైర్లు ఎక్కడ పడితే అక్కడ తెగి కిందకు పడుతున్నాయని, ఎన్నిసార్లుఫోన్‌చేసినా, కనీసం స్పందనలేదని స్థానికసబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను సంప్రదించగా అతను సరైన సమాధానం చెప్పడంలేదని వారు వాపోతున్నారు. హిందూపురం డీఈని సంప్రదించగా ఆయన త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని రైతులకు హామీ ఇచ్చారు. దీనిపై చెరువు సంఘం అధ్యక్షులు హనుమంతరాయ, ఉపాధ్యక్షుడు శేఖర్, శ్రీనివాస్, రంగనాథ, బసవరాజు, బంగారు హననుమంతరాయప్ప, వడ్డేనారాయణ, గోపాల్, గిరీష్, మంజునాథ్, నింగేగౌడ్, తదితరులు మాట్లాడుతూ.. స్థానిక అధికారులు రైతులకు ఎటువంటి సమాధానం ఇవ్వడం లేదని, లోఓల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మధూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న రైతులు

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా

అగళి: లోవోల్టేజి సమస్యతో బాధపడుతున్న అగళి మండల రైతులు పోరాటబాట పట్టారు. మధుడి సబ్‌స్టేషన్ ముందు లోకేష్, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్, చంద్రప్ప, చంద్రశేఖర్, ముత్తప్ప, దొడ్డయ్య తదితర రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోఓల్టేజి సమస్య కారణంగా వారానికి రెండు మూడు మార్లు మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మోటర్లకు లో ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరారు. ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు మాట్లాడుతూ ఆ గ్రామాలకు 45కి.మీ, దూరం నుంచి విద్యుత్ సరఫరా కావాల్సి ఉందని దీంతో లోఓల్టేజి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

రొళ:మండలంలోని హనుమంతనపల్లి, రొళ్లగొల్లహట్టి గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ ముందు గేట్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా రైతులు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. విద్యుత్ అధికారి నిజాముద్దీన్ స్పందించి విద్యుత్ సక్రమంగా అందజేస్తామని తెలపడంతో రైతులు శాంతించారు.

అంగన్‌వాడీ కోడిగుడ్లలో పురుగులు

మడకశిర రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే కోడిగుడ్లలో పురుగులు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఏఆర్ రొప్పం, గౌరిపురం గ్రామాల్లో గర్భవతులకు కోడిగ్రుడ్లను అందచేశారు. వాటిని ఇంటికి తీసుకువెళ్లి పరిశీలించగా అందులో పురుగులు కనిపించాయి. అలాంటివాటిని తినకుండా పారవేసినట్లు తెలిపారు. ఈ విషయమై అంగన్‌వాడీ కార్యకర్త కవితమ్మను విచారించగా తమకేంద్రానికి వచ్చిన కోడిగ్రుడ్లను పరిశీలించి చెడిపోయినవాటిని, పగిలిపోయినవాటిని తీసివేసి మంచి గ్రుడ్లను పంపిణీచేశామన్నారు. గౌరిపురంలో కూడా మంచి గ్రుడ్లనే పంపిణీ చేశామన్నారు. ప్రక్కనపెట్టిన చెడిపోయిన గ్రుడ్లను తీసుకువెళ్ళి పురుగులు ఉన్నాయని సోషియల్‌మీడియాలో హల్‌చల్ చేసినట్లు తెలిపారు.



చెడిపోయి పురుగులు పట్టిన కోడిగుడ్లు

పొలానికి దారిలేకుండా చేశారు..!

● సాయికాళేశ్వర్ ఫాంహౌస్ వద్ద రైతుల నిరసన

పెనుకొండ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుంచి తమ అధీనంలో ఉన్న పొలాలకు దారిలేకుండా సాయికాళేశ్వర్ ట్రస్ట్‌వారు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేయడంతో పొలాలకు వెళ్లలేకపోతున్నామని మండలంలోని వెంకటరెడ్డిపల్లి రైతులు వాపోయారు. రాంపురం సమీపంలోని సాయికాళేశ్వర్ స్వామి ఫామ్‌హౌస్ గేటు ముందు మంగళవారం వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు వెంకటేశ్ ప్రసాద్, శ్రీనివాసులు, రమేష్, భాస్కర్ దళవాయి అక్కులప్ప, తదితరులు మాట్లాడుతూ రాంపురం పొలంలో



సాయికాళేశ్వర్ ఫాంహౌస్ ముందు ఆందోళన చేస్తున్న రైతులు

సర్వేనంబరు 14లో తమ అన్నదమ్ములకు 20ఎకరాల భూమి ఉందన్నారు. గత కొంతకాలంగా తాము ఆభూమిని సాగుచేసుకుంటున్నామన్నారు. సాయికాళేశ్వర్ రైతుల వద్ద కొంతభూమి కొనుగోలు చేశారని, ఈ క్రమంలో ఏళ్లుగా పొలాలకు వెళ్లేదారిని ట్రస్ట్ సభ్యులు కబ్జాచేసి చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో వ్యవసాయ భూములకు వెళ్లలేకపోతున్నట్లు రైతులు తెలిపారు. ఇందువల్ల వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్వేనంబరు 21లో సావిత్రమ్మకు చెందిన 1.60ఎకరాలు, దళవాయి అక్కులప్పకు 1.50ఎకరాలు, చంద్రప్పకు 1.30ఎకరాలు రామాంజినప్పకు 1.56ఎకరాలు, ఆదిలక్ష్మమ్మకు చెందిన 2ఎకరాలను కొన్నేళ్లుగా తాము సాగుచేసుకోలేకపోతున్నామన్నారు. కాళేశ్వర్‌స్వామి కొన్న భూములకు సర్వేచేసి ఫెన్సింగ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కొన్నినెలల నుంచి అధికారులకు పొలాలకు వెళ్లేందుకు దారిచూపాలని అర్జీలు ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో సమస్యను మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె దీనిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారన్నారు. మంత్రి ఆదేశాలు కూడా రెవెన్యూ అధికారులు పాటించలేదని రైతులు వాపోతున్నారు. రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులు సాయికాళేశ్వర్ భార్య శిల్ప ఘటనా స్థలానికి వచ్చి పొలానికి దారి ఇస్తామని హామీ ఇచ్చి వెళ్లారన్నారు. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన చేపట్టినట్లు తెలిపారు.

ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం

అమరాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం అమరాపురం మండలంలో ఏరులై పారుతోంది. ఇది పూర్తిగా కర్ణాటక సరిహద్దు మండలం కావడంతో అమరాపురం మండలం చుట్టూ కిలో మీటరు, రెండు కిలోమీటర్ల దూరంలో కర్ణాటక మద్యం షాపులు ఉన్నాయి. విరుపసముద్రం గ్రామానికి కర్ణాటక ప్రాంతం మహదేవపురం, తమ్మడేపల్లి పంచాయతీకి కర్ణాటక సరిహద్దులోని లింగదహళ్లి గ్రామం, అమరాపురం గ్రామానికి సమీపంలో మద్దిహళ్లి గ్రామం ఉన్నాయి. చిట్టడుకు గ్రామానికి సమీపంలో అరసికెర కళారాజనపల్లిగ్రామం, హేమావతి పంచాయతీకి దొడ్డబాణగెర, నిడ్రగట్ట పంచాయతీకి లక్కనహళ్లిగ్రామం, బసవనపల్లికి మద్దేవు గ్రామం, ఇలా ప్రతి పంచాయతీకి కర్ణాటక ప్రాంతాన్ని ఆనుకొని మరో గ్రామం ఉండటం వల్ల అక్కడ కర్ణాటక మద్యం షాపులు ఉన్నాయి. అక్కడి నుంచి కర్ణాటక మద్యం అమరాపురం మండలంలోని దాదాపు 30 గ్రామాలకు సరఫరా అవుతోంది. కొంతమంది కర్ణాటక మద్యం అమ్మకాల వల్ల లాభం ఎక్కువగా వస్తుందన్న ఉద్దేశంతో కర్ణాటక మద్యం తెచ్చి విచ్చలవిడిగా మండలంలో అమ్ముతున్నారు. దీంతో ఆంధ్ర మద్యం అమ్మకాలు పూర్తిగా తగ్గాయి. కావున సంబంధిత ఎక్సైజ్ అధికారులు చొరవ తీసుకొని కర్ణాటక మద్యం అమ్మకాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన తుమల్ అధ్యక్షుడు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న తుమల్ అధ్యక్షుడు వెంకటేశ్

పావగడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను తుమకూరు జిల్లా పాల ఉత్పాదకుల సంఘం అధ్యక్షులు(తుమల్), పావగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ మంగళవారం ఉదయం బెంగళూరులోని విధానసౌధలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పావగడ ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు తుమకూరు జిల్లా పాల ఉత్పాదక సంఘం అధ్యక్షునిగా ఎన్నిక చేసేందుకు ముఖ్యమంత్రి ఎంతో శ్రమించారని, తనపై నమ్మకముంచి తనకు కట్టబెట్టిన అధ్యక్ష పదవికి న్యాయం చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప, సుధాకర్, తదితరులు హాజరయ్యారు.

అక్రమ మద్యం స్వాధీనం.. ఒకరిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు

సోమందేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదడకల మలుపు వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న రామాంజినేయులును అరెస్ట్ చేసినట్లు సీఐ సృజన్‌బాబు తెలిపారు. వివరాల్లోకెళితే కర్నాటక రాష్ట్రం నుంచి సోమందేపల్లి మండలానికి అక్రమ మద్యం తెచ్చి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులు గోవిందనాయక్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. హైవార్డ్స్ చీస్ విస్కీ 48ప్యాకెట్లు సీజ్ చేసి రామాంజినేయులుపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హరి క్రిష్ణ, ఇన్‌స్పెక్టర్ ఓం సింహ, కానిస్టేబుల్ మల్లికార్జున, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులేరు రోడ్డులో నివాసముంటున్న సంచార జాతికి చెందిన వివాహిత శ్యామల క్రిమిసంహారక మందు తాగి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శ్యామలకు ఆమె భర్త చిన్న మధ్య నెలకొన్న వివాదం కారణంగా మనస్థాపానికి గురైన ఆమె విషద్రావకం తాగడంతో అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్సలనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల ఆందోళన

పావగడ,జనవరి 28(ఆంధ్రజ్యోతి): కళాశాలకు ఉదయం పూట వెళ్లేందుకు సరైన సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిగ్రీ, పీయుసీ కళాశాల విద్యార్థులు డీఎం కార్యాలయం వద్ద మంగళవారం వాగ్వాదానికి దిగారు. రెండు మూడు కిలోమీటర్లు కళాశాలకు నడిచివెళ్లేందుకు అధిక సమయం పడుతున్నందున సరైన సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలని ఎన్నోసార్లు మనవి చేసినప్పటికీ డీఎం స్పందించలేదని ధ్వజమెత్తారు. తమకు బస్సు సౌకర్యం కల్పిస్తేనే కళాశాలకు వెళ్తామని లేనిపక్షంలో కెఎస్‌ఆర్‌టీసీ డిపోముందు ధర్నా చేపడతామని డిగ్రీ, పీయుసీ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు.

ఆముదం పంట దగ్ధం

హిందూపురం అర్బన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మోడల్ కాలనీ సమీపంలో రైతు ఆదినారాయణరావుకు సంబంధించిన పొలంలో ఆముదం పంట ఆదివారం రాత్రి అగ్నికి ఆహుతైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. తనకున్న 2.5 ఎకరాల పొలంలో ఆముదం పంట పండించానని రైతు కల్లూరు ఆదినారాయణరావు తెలిపారు. ఆదివారం రాత్రి గు ర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టారని దీంతో పంట మొత్తం కాలి బూడిదైపోయిందని ఆయన ఆవేదన చెందారు. దీంతోపాటు పొలం చుట్టూ ఉన్న నీలగిరి చెట్లు, వెదురు చెట్లు అగ్నికి ఆహుతైనాయని ఆవేదన చెందారు. విషయం తెలుసుకొని అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారని, కానీ అప్పటికే పంట పూర్తిగా కాలి బూడిదైపోయిందన్నారు. దాదాపు రూ70 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు పేర్కొన్నాడు.

పట్టుపురుగులపై విషప్రయోగం



విషప్రయోగంతో చనిపోయిన పట్టుపురుగులు

మడకశిర రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని దొడ్డేపల్లి గ్రామంలో తన ఫామ్‌లో పట్టుపురుగులపై గుర్తుతెలియని వ్యక్తులు విషప్రయోగం చేశారని పట్టురైతు శ్రీనివాసులు లబోదిబోమంటున్నాడు. సోమవారం సాయంత్రం షెడ్‌లో పట్టుపరుగులను చంద్రికల్లోకి వదిలేశామని, కాని కొద్ది సేపటికే ఆ పట్టుపురుగులు చనిపోయాయన్నారు. పట్టుపురుగులు వేయడానికి చంద్రికలను శుభ్రంచేసి షెడ్ బయటి ఉంచిన సమయంలో వాటిపై దుండగులు విషప్రయోగం చేసి ఉంటారని, ఇది తెలియక తాను చంద్రికలలో పురుగులను వేశానన్నారు. పురుగులన్నీ మరణించడంతో తాను ఆర్థికంగా ఎంతో నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. మల్బరీ పంట సాగుకు రూ.40 వేలు ఖర్చుచేశానన్నారు. ఈ విధంగా జరగడంతో రూ.1.30 లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విషప్రయోగం చేసినవారిని కఠినంగా శిక్షంచాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న సిరికల్చర్ ఏడీ రాజు ఆ గ్రామానికి వెళ్లి మల్బరీ షెడ్‌ను, ,చనిపోయిన పట్టుపురుగులను పరిశీలించారు. అనంతం ఏడీ మాట్లాడుతూ ఎవరో గిట్టని వారు పట్టు పురుగులపై విషప్రయోగం చేయడంతోనే ఆ పురుగులు చనిపోయాయన్నారు. పంట పెంపకంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

హిందూపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పంట సాగులో వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని ఏఓ సురేంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం గోళ్లాపురం, తూముకుంట పంచాయతీ పరిధిలో సాగుచేసిన వేరుశనగ, రాగి, మొక్కజొన్న పంటలకు సంబంధించి రైతులకు సూచనలు, సలహాలు తెలిపారు. ముఖ్యంగా 80శాతం సబ్సిడీతో డ్రోన్ పథకం ప్రవేశపెట్టిందని దీనిద్వారా పంటలకు మందు పిచికారి చేయడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాగిపంట సాగు విస్తీర్ణం పెంచాలని ఈ పంట దిగుబడి వస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. వాణిజ్య పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో నాయిబ్రాహ్మణులు

పెనుకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ నాయిబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎగువగడ్డ రామస్వామి దేవాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా రామాంజినేయులు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశులు, కార్యదర్శిగా అంజనేయులు, కోశాధికారిగా అంజనేయులు, సలహాదారుడిగా వెంకటరాముడు, ప్రభాకర్, గౌరవాధ్యక్షులుగా ఎంసీ బాబన్న, అంజనేయులు, లక్ష్మయ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ నాయిబ్రాహ్మణులకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు.

గ్లోబల్ అలియన్స్ బృందం పర్యటన

రొళ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమంతనపల్లి, వన్నారనపల్లి, ఆవినకుంట గ్రామాల్లో మంగళవారం గ్లోబల్ అలియన్స్ సభ్యులు పర్యటించారు. ఈసందర్భంగా లక్ష్మమ్మ పొలంలో ఇన్పుట్స్ బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికలు మొదలైన వాటి గురించి క్లుప్తంగా వివరించారు. వక్కలో బొప్పాయి, ఆకుకూరలు, కూరగాయలు, అలసందలతోపాటు పీఎండీఎస్ వేసిన ఫీల్డ్‌ను చూసి రైతు అనుభవాలను తెలుసుకొన్నారు. నారాయణప్ప పొలంలో చింత, మామిడి, అరటి, అవిసె, అనుములు, మిరప కంది పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో ఏవిధంగా పండించారో అడిగి తెలుసుకొన్నారు.

చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి..

పెనుకొండ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవ రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కాంతారావు ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. కళాశాల ప్రాంగణం చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించి మొక్కలు నాటడానికి భూమి చదును చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమమే లక్ష్యంగా పనిచేస్తూ కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరికెరలో పశువైద్య శిబిరం

గుడిబండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మేకలు, గొర్రెలు, పాడి ఆవులు, గేదెలకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా టీకాలు వేయడంతోపాటు గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ మందులు వేసినట్లు వైద్యాధికారిణి జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, నాయకుడు రవిస్వామి పాల్గొన్నారు.

డీసీఓ తనిఖీ

రొళ్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండల పరిధిలోని దొమ్మరహట్టి బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను డీసీఓ జయలక్ష్మీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోండి

పరిగి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని మంగళవారం పైడేటి, విట్టాపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి విజయభారతి వరి, మొక్కజొన్న, పంటల సాగు గురించి వివరించారు.